ఉత్తరం
TG TEL/25/A1234
www.kakatiyanews.com
# కాకతీయ
గురువారం, 13 ఆగస్టు 2026 | సంపుటి: 01 | సంచిక: 365 | పేజీలు: 6 | వెల: 5

## జోగులాంబ జోన్ డీఐజీ చౌహాన్ బదిలీ

- డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు
- అవినీతి ఆరోపణలే కారణమా..?
- డీజీపీ చెప్పిన నలుగురిలో ఒకరిపై వేటు!
- మిగతా ముగ్గురిపైనా చర్యలు ఉంటాయా?

2




### తెలంగాణకు 11.56 లక్షల ఇళ్లు
## కేటాయించండి

కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌కు మంత్రి పొంగులేటి వినతి

ఏడాది క్రితమే సర్వే పూర్తి.. మంజూరులోనే జాప్యం

ఒక్కసారిగా ఇళ్లన్నీ మంజూరు చేయాలని విజ్ఞప్తి

ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం

తెలంగాణ పర్యటనకు రావాలని కేంద్ర మంత్రికి ఆహ్వానం

సానుకూలంగా స్పందించిన శివరాజ్‌సింగ్ చౌహాన్



**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ కింద తెలంగాణకు 11,56,915 ఇళ్లను ఒకేసారి కేటాయించాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. గతంలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి కేంద్రానికి రాసిన లేఖను కూడా ఈ సందర్భంగా ప్రస్తావించిన పొంగులేటి.. రాష్ట్రంలో ఇళ్ల కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 'ఆవాస్ ప్లస్-2024' యాప్ ద్వారా అత్యంత పారదర్శకంగా ఇంటింటి సర్వే నిర్వహించినట్లు మంత్రి వివరించారు. ఈ సర్వేలో 11.56 లక్షలకు పైగా గ్రామీణ పేద కుటుంబాలు ఇళ్లకు అర్హులుగా తేలాయని తెలిపారు. అర్హతల నిర్ధారణతో పాటు సూపర్ చెక్, అనర్హుల తొలగింపు ప్రక్రియలు కూడా ఏడాది క్రితమే పూర్తయ్యాయని చెప్పారు. అయినప్పటికీ కేంద్రం నుంచి ఇళ్ల లక్ష్యాల ప్రకటనలో జాప్యం జరుగుతోందని పేర్కొన్నారు. తెలంగాణలో గత 12 ఏళ్లుగా పేదలకు ఇళ్ల నిర్మాణం నిలిచిపోవడంతో భారీగా డిమాండ్ పేరుకుపోయిందని పొంగులేటి తెలిపారు. ఈ నేపథ్యంలో

........(తరువాయి 2లో)

“ ప్రభుత్వానికి బకాయిపడ్డ రైస్ మిల్లర్ల నుంచి ప్రతి పైసా రాబట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకుని సకాలంలో బియ్యం అప్పగించకుండా బకాయిలు పెడుతున్న డిఫాల్ట్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉద్దేశపూర్వకంగా బకాయిలు చెల్లించకుండా తప్పించుకునే మిల్లులను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. బకాయిల వసూలు విషయంలో మిల్లర్ల బెదిరింపులు, బ్లాక్‌మెయిల్‌కు ప్రభుత్వం లొంగేది లేదని తేల్చిచెప్పారు. పౌరసరఫరాల శాఖపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ధాన్యాన్ని తీసుకున్న తర్వాత నిబంధనల ప్రకారం బియ్యం అప్పగించకుండా బకాయిలు పెట్టే మిల్లర్లను ఉపేక్షించకూడదని సీఎం అన్నారు. ప్రభుత్వ ధనాన్ని తమ వద్దే ఉంచుకుని పదేపదే గడువులు దాటుతున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. బకాయిల రికవరీకి ప్రత్యేక విధానాన్ని రూపొందించి, గతంలో జరిగిన లోపాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బకాయిపడిన మిల్లుల వివరాలు, ప్రభుత్వం నుంచి తీసుకున్న ధాన్యం, తిరిగి అప్పగించాల్సిన బియ్యం, చెల్లించాల్సిన మొత్తాలను సమగ్రంగా పరిశీలించి రికవరీ ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. - కాకతీయ, తెలంగాణ బ్యూరో




# బకాయిలుంటే మిల్లులు సీజ్

రైస్ మిల్లర్లకు సీఎం రేవంత్‌రెడ్డి గట్టి షాక్

## డిఫాల్ట్ మిల్లుల స్వాధీనానికి ఆదేశం

2

బెదిరింపులు, బ్లాక్‌మెయిల్‌కు లొంగేది లేదని స్పష్టీకరణ

మహిళా సంఘాలకు మిల్లింగ్ బాధ్యతలు అప్పగించే యోచన


ప్రభుత్వ ధాన్యం తీసుకుని బియ్యం ఇవ్వకపోతే కఠిన చర్యలు

అభివృద్ధి పనులకు నిధుల కొరత.. కేడర్ సహకారమూ కరువు

పాత కాంగ్రెస్ నేతలతో ఆధిపత్య పోరు.. నియోజకవర్గాల్లో వర్గాల కుంపట్లు

పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు అంశమూ వెంటాడుతున్న వైనం

ముందున్నది రాజకీయ పరీక్షే.. భవిష్యత్తుపై నేతల్లో గుబులు



కండువా మార్చి..
# కష్టాల్లో!

హస్తం గూటిలో ఇమడలేక.. గులాబీ గూటికి తిరిగి వెళ్లలేక

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** అధికారమే అండగా ఉంటుందని.. నియోజకవర్గాల్లో నిధుల వరద పారుతుందని ఆశించి గులాబీ కండువా తీసేసి హస్తం గూటికి చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఇప్పుడు లెక్కలు తారుమారవుతున్నాయా? అధికార పార్టీలో చేరితే రాజకీయంగా తిరుగుండదని భావించిన నేతలకు క్షేత్రస్థాయిలో మాత్రం కొత్త సమస్యలు ఎదురవుతున్నాయా? పాత కాంగ్రెస్ నాయకత్వం నుంచి సహకారం లేకపోవడం,

........(తరువాయి 2లో)


## ఆగమ శాస్త్రం ప్రకారమే రాజన్న ఆలయ అభివృద్ధి

### గర్భాలయం, మహామండపం యథాతథంగా ఉంటాయి

- శిఖరాన్ని శిలామయంగా నిర్మించి నాలుగు అడుగుల మేర పెంచే యోచన
- రూ.250 కోట్లతో కొనసాగుతున్న అభివృద్ధి పనులు
- భక్తులు ఎలాంటి అపోహలు నమ్మవద్దు : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

2






4

## వేటగాళ్ల విద్యుత్ ఉచ్చుకు ఎఫ్‌బీఓ బలి

- విధి నిర్వహణలో విషాదం.. బానోతు నవీన్ మృతి
- వన్యప్రాణుల వేటకు ఉచ్చు ఏర్పాటు చేసినట్లు అనుమానాలు
- నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్



# ఎఫ్ఆర్‌సీ చెల్లదు.. ఈసీ స్పష్టీకరణ

## ఎస్ఐఆర్‌లో ఓటరు అర్హతకు పరిగణనలోకి తీసుకోలేం

- రేషన్ కార్డుకు సమానమైన పత్రం మాత్రమే
- సుప్రీంకోర్టు ఆమోదించిన 12 డాక్యుమెంట్లలో రేషన్‌కార్డు లేదు
- జూలై 25 తర్వాత జారీ చేసిన ఎఫ్ఆర్‌సీలకు గుర్తింపు లేదు
- 2013 నాటి నిబంధనల ప్రకారం జారీ చేసిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌కు అవకాశం

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** తెలంగాణలో ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఓటరు అర్హత ధ్రువీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం జారీ చేస్తున్న ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ (ఎఫ్ఆర్‌సీ)ను పరిగణనలోకి తీసుకోబోమని కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. కొత్తగా జారీ చేస్తున్న ఎఫ్ఆర్‌సీ కేవలం రేషన్‌కార్డులోని వివరాల ఆధారంగా ఇస్తున్న పత్రం మాత్రమేనని, రేషన్‌కార్డుకు ఉన్న స్థాయికంటే అదనపు ఆధార విలువ దానికి లేదని తేల్చిచెప్పింది. ఎస్ఐఆర్‌లో సుప్రీంకోర్టు ఆమోదించిన 12 పత్రాల్లో రేషన్‌కార్డు లేనందున దాని ఆధారంగా జారీ చేస్తున్న ఎఫ్ఆర్‌సీని కూడా అర్హత ధ్రువీకరణ పత్రంగా పరిగణించలేమని పేర్కొంది. ఈ మేరకు తెలంగాణ ఎన్నికల అధికారులకు ఈసీ స్పష్టత ఇచ్చినట్లు వెల్లడైంది. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల అర్హత ధ్రువీకరణకు అవసరమైన పత్రాల విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన మార్గదర్శకాల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ జారీకి నిర్ణయించింది. ఇందుకోసం గత నెల 25న జీఓ 172ను జారీ చేసింది. రేషన్‌కార్డుల్లో నమోదైన కుటుంబ వివరాల ఆధారంగా ఎఫ్ఆర్‌సీలను జారీ చేయాలని తహసీల్దార్లను ఆదేశించింది. రాష్ట్రంలో ఎఫ్ఆర్‌సీని ఎస్ఐఆర్‌లో పరిగణనలోకి తీసుకుంటారా? లేదా? అన్న అంశంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి గత నెల 31న, ఈ నెల 10న కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖలు రాశారు. ఇదే సమయంలో ఎఫ్ఆర్‌సీని ఎస్ఐఆర్‌కు ఆధారంగా పరిగణించవద్దంటూ దాఖలైన పిటిషన్లపై స్పందించాలని హైకోర్టు కూడా ఈసీ, సీఈవోలను ఆదేశించింది. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం తాజా స్పష్టత ప్రాధాన్యం సంతరించుకుంది.


**పాత సర్టిఫికెట్‌కు మాత్రం అవకాశం**

అయితే, 2013 జూలై 25న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్

........(తరువాయి 2లో)

# కండువా మార్చి.. కష్టాల్లో!

(మొదటిపేజీ తరువాయి)



అభివృద్ధి పనులకు ఆశించిన స్థాయిలో నిధులు రాకపోవడం, నియోజకవర్గాల్లో రెండు వర్గాలుగా పార్టీ నడుస్తుండటం.. మరోవైపు పార్టీ ఫిరాయింపులపై అనర్హత అంశం వెంటాడుతుండటంతో ఆ పది మంది ఎమ్మెల్యేలు రాజకీయంగా ఇరుకునపడుతున్నారనే చర్చ మొదలైంది. అధికారంలో ఉన్నా కాంగ్రెస్‌లో పూర్తిస్థాయిలో కలిసిపోలేక.. బీఆర్ఎస్‌కు తిరిగి వెళ్లే పరిస్థితి లేక మధ్యలో కొట్టుమిట్టాడుతున్నారనే అభిప్రాయాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ గూటికి చేరిన దానం నాగేందర్, ప్రకాశ్‌గౌడ్, గూడెం మహిపాల్‌రెడ్డి, అరికెపూడి గాంధీ, కాలే యాదయ్య, సంజయ్‌కుమార్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, తెల్లం వెంకట్రావు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిల విషయంలో ఈ చర్చ మరింత ఆసక్తికరంగా మారింది. వీరిలో కొందరు నియోజకవర్గ అభివృద్ధి కోసమే పార్టీ మారామని చెబుతుండగా.. ఆశించిన పనులు జరగకపోవడంతో అసంతృప్తి బయటపడుతోంది. బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఈ పరిస్థితికి మరింత బలం చేకూర్చాయి. తాను మంత్రి పదవి కోసం, వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాంగ్రెస్‌లో చేరలేదని.. నియోజకవర్గ అభివృద్ధి కోసమే నిర్ణయం తీసుకున్నానని ఆయన చెప్పడం పార్టీలోనే చర్చకు దారితీసింది. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు కాకపోవడం, కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిచిపోవడంపై ఆయన బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు.

**పోచారం మాటలతో బయటపడ్డ అసంతృప్తి**

బాన్సువాడలో పోచారం శ్రీనివాస్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేల పరిస్థితిపై చర్చకు కేంద్రంగా మారాయి. మంత్రి పదవి కోసమో, వ్యక్తిగత పనుల కోసమో తాను కాంగ్రెస్‌లో చేరలేదని.. ప్రాంత అభివృద్ధి కోసమే నిర్ణయం తీసుకున్నానని ఆయన చెప్పడం గమనార్హం. నియోజకవర్గంలోని పెండింగ్ పనులను ఆరు నెలల్లో పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు నెరవేరడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీఎం ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డి కనీసం ఫోన్ కూడా ఎత్తడం లేదని ఆయన వాపోయినట్లు పేర్కొంటున్నారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు మధ్యలోనే ఆగిపోయాయని చెప్పడం అధికార పార్టీలో చేరిన ఎమ్మెల్యేల అసంతృప్తికి అద్దం పడుతోందనే చర్చ జరుగుతోంది. కేసీఆర్ హయాంలోనే నియోజకవర్గ అభివృద్ధి జరిగిందని పోచారం చేసిన వ్యాఖ్యలు కూడా రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కాంగ్రెస్‌లో చేరినా తాను కాంగ్రెస్ కండువా కప్పుకోలేదని, జాతీయ జెండానే కప్పుకున్నానని చెప్పడం.. పార్టీ మారిన ఎమ్మెల్యేల మనోగతంపై కొత్త చర్చకు తెరతీసింది. అధికార పార్టీలో చేరిన తర్వాత కూడా పాత రాజకీయ అనుబంధాల ప్రభావం కొనసాగుతుండటం కాంగ్రెస్‌కు కొత్త తలనొప్పిగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఇటు కాంగ్రెస్.. అటు బీఆర్ఎస్ కాదు!**

పార్టీ మారిన ఎమ్మెల్యేలకు అసలు చిక్కు ఇక్కడే మొదలవుతోందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కాంగ్రెస్‌లో చేరినా పాత నాయకత్వం వారిని పూర్తిస్థాయిలో అంగీకరించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఎన్నో ఏళ్లుగా పార్టీ కోసం పనిచేసిన తమను పక్కనపెట్టి.. నిన్నమొన్నటి వరకు ప్రత్యర్థులుగా ఉన్న ఎమ్మెల్యేలకు ప్రాధాన్యం ఇవ్వడాన్ని స్థానిక నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని చెబుతున్నారు. దీంతో అనేక నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే వర్గం, పాత కాంగ్రెస్ వర్గం అంటూ రెండు శిబిరాలు ఏర్పడ్డాయి. ఖైరతాబాద్, పటాన్‌చెరు, జగిత్యాల, చేవెళ్ల, గద్వాల వంటి నియోజకవర్గాల్లో ప్రోటోకాల్, పార్టీ పదవులు, స్థానిక సంస్థల వ్యవహారాల్లో ఆధిపత్య పోరు కొనసాగుతోందనే చర్చ ఉంది. మండల, పట్టణ కాంగ్రెస్ కమిటీల ఏర్పాటు సమయంలోనూ ఎవరికి ప్రాధాన్యం ఇవ్వాలన్న దానిపై విభేదాలు తలెత్తుతున్నాయి. స్థానిక కేడర్ పూర్తిస్థాయిలో సహకరించకపోతే కొత్తగా వచ్చిన ఎమ్మెల్యేలు ఒంటరిగానే రాజకీయ కార్యక్రమాలు నిర్వహించాల్సి వస్తోంది. ఎమ్మెల్యేలకు అధికార హోదా ఉన్నా.. పార్టీ యంత్రాంగంపై పూర్తి పట్టు లేకపోవడం వారిని ఇబ్బందికి గురిచేస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**అధికారం ఉన్నా.. పనులు చేయలేని పరిస్థితి?**

ఎమ్మెల్యేగా అధికారంలో ఉన్నప్పటికీ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా సాగకపోతే ప్రజలకు సమాధానం చెప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పార్టీ మారిన సమయంలో తమ నిర్ణయానికి ప్రధాన కారణంగా అభివృద్ధినే ముందుకు తెచ్చిన ఎమ్మెల్యేలు.. ఇప్పుడు అదే అంశంపై ప్రజలకు సమాధానం చెప్పాల్సి వస్తోంది. పెండింగ్ పనులు, కాంట్రాక్టర్ల బిల్లులు, కొత్త పనులకు నిధులు వంటి అంశాల్లో ఆశించిన పురోగతి కనిపించకపోతే.. పార్టీ మార్పు వల్ల తమ నియోజకవర్గానికి ఒరిగిందేమిటన్న ప్రశ్న ప్రజల నుంచి ఎదురయ్యే అవకాశం ఉంది. మరోవైపు పార్టీ ఫిరాయింపులపై కొనసాగుతున్న న్యాయపరమైన అంశం కూడా ఎమ్మెల్యేల భవిష్యత్తుపై నీడలా వెంటాడుతోంది. కాంగ్రెస్‌లో చేరినా చట్టపరంగా విలీనం ప్రక్రియ పూర్తికాకపోవడం, అనర్హత పిటిషన్ల అంశం కొనసాగుతుండటం వారికి రాజకీయంగా అసౌకర్యంగా మారింది. ఒకవైపు అధికార పార్టీలో తమ స్థానం బలపడాలని కోరుకుంటూనే.. మరోవైపు భవిష్యత్తులో ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయోనన్న ఆందోళన నెలకొంది. దానం నాగేందర్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలవడం కూడా పార్టీ మారిన ఎమ్మెల్యేల రాజకీయ ప్రయాణంపై చర్చకు కారణమైంది. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నియోజకవర్గంలో ఉన్న వ్యక్తిగత బలం.. పార్టీ మారిన తర్వాత కూడా అదే స్థాయిలో కొనసాగుతుందా అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజల్లో పార్టీ మార్పుపై ఉన్న అభిప్రాయాన్ని మార్చుకోవడంతోపాటు.. కొత్త పార్టీ కేడర్‌ను తన వెంట నడిపించుకోవాల్సిన అవసరం ఏర్పడింది. మొత్తంగా గులాబీ గూటిని వీడి హస్తం చెంతకు చేరిన పది మంది ఎమ్మెల్యేలకు ఇప్పుడు అధికారం కంటే రాజకీయంగా నిలదొక్కుకోవడమే పెద్ద సవాలుగా మారిందనే చర్చ సాగుతోంది. ఒకవైపు పాత కాంగ్రెస్ నేతలతో సఖ్యత సాధించాలి.. మరోవైపు నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులు పరుగులు పెట్టించాలి.. ఇంకోవైపు ఫిరాయింపులపై న్యాయపరమైన పరిణామాలను ఎదుర్కోవాలి. ఈ మూడు అంశాల్లో ఏ ఒక్కటి బెడిసికొట్టినా వచ్చే ఎన్నికల నాటికి దాని ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. కండువా మార్చిన తర్వాత అధికారం దక్కినా.. రాజకీయంగా పట్టు దక్కకపోతే పరిస్థితి ఏమిటో ఈ పది మంది ఎమ్మెల్యేల పరిణామాలు స్పష్టం చేస్తున్నాయనే చర్చ ఇప్పుడు కాంగ్రెస్ వర్గాల్లోనూ మొదలైంది.

# ఆగమ శాస్త్రం ప్రకారమే రాజన్న ఆలయ అభివృద్ధి

- గర్భాలయం, మహామండపం యథాతథంగా ఉంటాయి
- శిఖరాన్ని శిలామయంగా నిర్మించి నాలుగు అడుగుల మేర పెంచే యోచన
- రూ.250 కోట్లతో కొనసాగుతున్న అభివృద్ధి పనులు
- భక్తులు ఎలాంటి అపోహలు నమ్మవద్దు : ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**కాకతీయ, వేములవాడ** : దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులను ఆగమ శాస్త్ర నిబంధనలు, భక్తుల మనోభావాలకు అనుగుణంగానే చేపడుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. ఆలయ అభివృద్ధి పనులపై స్పష్టత కోసం అధికారులు, ఆలయ అర్చకులతో కలిసి శృంగేరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి స్వామివారిని కలిసి వివరాలను సమర్పించినట్లు తెలిపారు. గర్భాలయం, మహామండపం విషయంలో భక్తుల్లో నెలకొన్న అనుమానాలను పీఠాధిపతి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. గర్భాలయం, మహామండపాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ మార్చడం లేదా తొలగించడం లేదని ఆది శ్రీనివాస్ స్పష్టం చేశారు. సోషల్ మీడియా, పత్రికల్లో జరుగుతున్న ప్రచారాన్ని నమ్మి భక్తులు ఆందోళన చెందవద్దని సూచించారు.

**రూ.250 కోట్లతో అభివృద్ధి పనులు**

ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం ఇప్పటికే సుమారు రూ.250 కోట్ల నిధులు కేటాయించిందని, ప్రస్తుతం దాదాపు 55 శాతం పనులు పూర్తయ్యాయని ఆది శ్రీనివాస్ తెలిపారు. గతంలో రూ.50 కోట్లు, అనంతరం రూ.100 కోట్లు, తాజాగా రూ.99.40 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ప్రస్తుతం ఉన్న శిఖరం 1973లో నిర్మించబడిందని తెలిపారు. దానిని శిలామయంగా పునర్నిర్మించి సుమారు నాలుగు అడుగుల మేర ఎత్తు పెంచే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో బంగారు తాపడం చేసుకునే అవకాశం ఉండేలా శిలామయ శిఖరాన్ని నిర్మించాలని శృంగేరి పీఠాధిపతి సూచించినట్లు తెలిపారు. నిర్మాణానికి ముందు భూమి బలం, నిర్మాణ స్థిరత్వం తదితర సాంకేతిక అంశాలను పూర్తిగా పరిశీలించాలని పీఠాధిపతి సూచించినట్లు వివరించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అనివెట్టి మండపాన్ని ఆధునికంగా నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాచీనత, సంప్రదాయాలను కాపాడుతూ ఆగమ శాస్త్రానికి అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని, శృంగేరి పీఠాధిపతి సూచనలు, ఆశీస్సులతో పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని అధికారులు, ఆలయ అర్చకులు తెలిపారు.

# ఎఫ్ఆర్సీ చెల్లదు.. ఈసీ స్పష్టీకరణ

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం జారీ చేసిన మెమో నిబంధనల ప్రకారం జారీ చేసిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను అవసరమైతే పరిగణనలోకి తీసుకుంటామని ఈసీ తెలిపింది. ఆ నిబంధనల ప్రకారం కుటుంబ సభ్యుల వివరాలపై క్షేత్రస్థాయి విచారణ, సంబంధిత డాక్యుమెంట్ల పరిశీలన అనంతరం సర్టిఫికెట్ జారీ చేస్తారని ఈసీ పేర్కొంది. దీనికి భిన్నంగా తాజా జీఓ ప్రకారం జారీ చేస్తున్న ఎఫ్ఆర్సీకి క్షేత్రస్థాయి విచారణ లేకుండా రేషన్‌కార్డులో ఉన్న సమాచారాన్నే ధ్రువీకరించే విధానం ఉందని ఈసీ అభిప్రాయపడింది. అందువల్ల ఈ రెండు సర్టిఫికెట్లను ఒకే రకంగా చూడలేమని స్పష్టం చేసినట్లు సమాచారం. ఎస్ఐఆర్‌లో ఓటరు అర్హతను నిర్ధారించేందుకు సుప్రీంకోర్టు ఆమోదించిన 12 రకాల పత్రాలను ఈసీ పరిగణనలోకి తీసుకుంటోంది. అయితే ఆ జాబితాలో రేషన్‌కార్డు లేకపోవడంతో, దానికి సమానమైన ఆధారంగా మాత్రమే పరిగణించే కొత్త ఎఫ్ఆర్సీ కూడా చెల్లుబాటు కాదని ఎన్నికల సంఘం తేల్చింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశించిన కొత్త ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ ద్వారా ఎస్ఐఆర్‌లో ఓటరు అర్హతను ధ్రువీకరించుకోవాలనుకున్న వారికి తాజా నిర్ణయం కీలకంగా మారింది. ఇప్పటికే ఎఫ్ఆర్సీల కోసం దరఖాస్తు చేసుకున్నవారిలోనూ దీనిపై సందిగ్ధత నెలకొనే అవకాశం ఉంది.

**ప్రభుత్వానికి ఈసీ నిర్ణయం షాక్**

ఎస్ఐఆర్‌లో రాష్ట్రంలోని కుటుంబాల వివరాలను ధ్రువీకరించేందుకు ఎఫ్ఆర్సీ ఉపయోగపడుతుందని ప్రభుత్వం భావించింది. అందులో భాగంగానే ప్రత్యేక విధానాన్ని రూపొందించి జీఓ జారీ చేసింది. అయితే కేంద్ర ఎన్నికల సంఘం తాజా వివరణతో ఆ విధానానికి పరిమితులు ఏర్పడ్డాయి. ముఖ్యంగా రేషన్‌కార్డు ఆధారంగా జారీ చేసే కొత్త ఎఫ్ఆర్సీని ఓటరు అర్హతకు ఆధారంగా పరిగణించలేమన్న ఈసీ నిర్ణయం ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వానికి కీలక సవాలుగా మారింది. మరోవైపు గత నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయి విచారణ అనంతరం జారీ చేసిన ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లకు మాత్రం అవకాశం ఉండటంతో, ఎస్ఐఆర్‌లో పత్రాల సమర్పణపై మరింత స్పష్టత అవసరమవుతోంది. అంటే.. కొత్త ఎఫ్ఆర్సీ ఉన్నంత మాత్రాన ఎస్ఐఆర్‌లో ఓటరు అర్హత రుజువైనట్లు కాదన్నది ఈసీ తాజా స్పష్టత సారాంశం.

# తెలంగాణకు 11.56 లక్షల ఇళ్లు కేటాయించండి

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రానికి అర్హత ఉన్న 11,56,915 ఇళ్లను విడతలవారీగా కాకుండా ఒకేసారి కేటాయించాలని కేంద్ర మంత్రిని కోరారు.

**ఇంటికి రూ.5 లక్షల సాయం**

పీఎంఏవైజీ కింద కేంద్రం అందించే వాటాతో పాటు సాధారణ రాష్ట్ర వాటాకు సంబంధం లేకుండా ప్రతి పేద కుటుంబం సొంతంగా ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు పొంగులేటి తెలిపారు. ఇందుకు అవసరమైన నిధులను ఇప్పటికే రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించినట్లు వెల్లడించారు. కేంద్రం నుంచి ఇళ్ల కేటాయింపులు జరిగితే రాష్ట్ర ప్రభుత్వం తన వాటా సాయంతో గ్రామీణ పేదల సొంతింటి కలను వేగంగా సాకారం చేయడానికి అవకాశం ఉంటుందని వివరించారు. కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను తెలంగాణలో పర్యటించాల్సిందిగా మంత్రి పొంగులేటి సాదరంగా ఆహ్వానించారు. స్వయంగా రాష్ట్రానికి వచ్చి పీఎంఏవైజీ 2.0 కింద ఇళ్ల కేటాయింపును ప్రకటిస్తే తెలంగాణ గ్రామీణ పేదలకు కొండంత అండగా నిలుస్తుందని అన్నారు. ఇది రాష్ట్ర చరిత్రలో చారిత్రాత్మక ఘట్టంగా నిలుస్తుందని పేర్కొన్నారు. పొంగులేటి విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణలో పర్యటించేందుకు అంగీకరించినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో ఎంపీలు మల్లు రవి, వేం నరేందర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, సురేష్ షెట్కార్, రామసహాయం రఘురాం రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌తో పాటు తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్ తదితరులు ఉన్నారు.

# జోగులాంబ జోన్ డీఐజీ చౌహాన్ బదిలీ

- డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు
- అవినీతి ఆరోపణలే కారణమా..?
- డీజీపీ చెప్పిన నలుగురిలో ఒకరిపై వేటు!
- మిగతా ముగ్గురిపైనా చర్యలు ఉంటాయా?




**కాకతీయ, తెలంగాణ బ్యూరో** : పోలీసు శాఖలో నలుగురు ఐపీఎస్ అధికారుల ప్రవర్తనపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన డీజీపీ సీవీ ఆనంద్ వ్యాఖ్యల నేపథ్యంలో తొలి వేటు పడింది. జోగులాంబ జోన్ డీఐజీ చౌహాన్‌ను ప్రభుత్వం బదిలీ చేస్తూ.. డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేసింది. దీంతో డీజీపీ ప్రస్తావించిన నలుగురు అధికారుల్లో ఒకరిపై చర్యలు ప్రారంభమైనట్లు పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది. చౌహాన్‌పై గతంలో వచ్చిన అవినీతి ఆరోపణలు, విధి నిర్వహణలో వ్యవహరించిన తీరుపై ఫిర్యాదులు, కింది స్థాయి సిబ్బందితో అనుచిత ప్రవర్తన వంటి అంశాలే తాజా చర్యలకు కారణమై ఉండొచ్చని ఉన్నతస్థాయి వర్గాల్లో చర్చ జరుగుతోంది. వరంగల్ పర్యటన సందర్భంగా పోలీసు శాఖలోని కొందరు ఐపీఎస్ అధికారుల పనితీరు, ప్రవర్తనపై డీజీపీ సీవీ ఆనంద్ తీవ్ర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. నలుగురు అధికారుల ప్రవర్తన సరిగా లేదని ఆయన పేర్కొనడం అప్పట్లో పోలీసు వర్గాల్లో సంచలనంగా మారింది. అప్పటి నుంచి ఆ నలుగురు ఎవరనే దానిపై శాఖలో విస్తృత చర్చ సాగుతోంది. తాజాగా జోగులాంబ జోన్ డీఐజీ చౌహాన్‌పై బదిలీ వేటు పడటంతో ఆ చర్చకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది.

**డీజీపీ కార్యాలయానికి అటాచ్**

చౌహాన్‌ను జోగులాంబ జోన్ డీఐజీ బాధ్యతల నుంచి తప్పించి డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సాధారణ బదిలీగా కాకుండా కీలక బాధ్యతల నుంచి తప్పించి డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేయడం పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది. చౌహాన్‌పై గతంలో వచ్చిన ఆరోపణలు, ఆయన పనితీరుపై ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకున్నట్లు ఉన్నతస్థాయి వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. చౌహాన్ విధి నిర్వహణ తీరుపై గతంలోనే పలు ఆరోపణలు ఉన్నట్లు పోలీసు వర్గాల్లో చర్చ ఉంది. విజిట్, ఇన్‌స్పెక్షన్‌కు వెళ్లిన సందర్భాల్లో తనకు ప్రత్యేక ఆతిథ్యం కల్పించాలని కిందిస్థాయి సిబ్బందిపై ఒత్తిడి చేసేవారని ఆరోపణలు వచ్చాయి. కనీసం ఆరు రకాల మాంసాహార వంటకాలు, బిర్యానీలతో ఖరీదైన విందులు ఏర్పాటు చేయాలనే విధంగా వ్యవహరించేవారని కిందిస్థాయి సిబ్బంది ఆరోపించినట్లు తెలుస్తోంది. ఈ తరహా వ్యవహార శైలిపై పలుమార్లు ఫిర్యాదులు వెళ్లినట్లు పోలీసు వర్గాల్లో ప్రచారం ఉంది.

**పోస్టింగుల్లో జోక్యం.. వసూళ్ల ఆరోపణలు**

హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్సైలు, ఎస్సైల బదిలీలు, పోస్టింగుల్లో నేరుగా జోక్యం చేసుకునేవారని, తనకు అనుకూలంగా ఉండే వారికి ప్రాధాన్యం ఇచ్చేవారని ఆయనపై విమర్శలు ఉన్నాయి. బదిలీలు, పోస్టింగుల విషయంలో పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడ్డారనే ఆరోపణలు కూడా గతంలో వినిపించాయి. అయితే ఈ ఆరోపణలపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ వెలువడలేదు. తాజా బదిలీ నేపథ్యంలో ఈ పాత ఆరోపణలు మరోసారి పోలీసు శాఖలో చర్చకు వస్తున్నాయి. నలుగురు ఐపీఎస్ అధికారుల ప్రవర్తనపై డీజీపీ బహిరంగంగా వ్యాఖ్యానించిన నేపథ్యంలో.. వారిలో ఒకరిపై చర్యలు ప్రారంభం కావడంతో మిగతా ముగ్గురి వ్యవహారంపై కూడా పోలీసు వర్గాల్లో ఆసక్తి నెలకొంది. వారిపైనా ప్రభుత్వం అంతర్గతంగా సమీక్ష నిర్వహిస్తోందా? చర్యలు తీసుకునే అవకాశం ఉందా? అనే చర్చ సాగుతోంది. ఒక అధికారిపై బదిలీ వేటుతోనే వ్యవహారం ముగుస్తుందా? లేక మిగతా ముగ్గురిపైనా వరుసగా చర్యలు ఉంటాయా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. డీజీపీ వ్యాఖ్యల తర్వాత తొలి చర్యగా చౌహాన్ బదిలీ జరగడంతో పోలీసు శాఖలో ఇప్పుడు 'మిగతా ముగ్గురు ఎవరు.. వారి సంగతేంటి?' అనే చర్చకు తెరలేచింది.

# మల్రిగడ్డలో వ్యవసాయ విద్యార్థుల గ్రామ అధ్యయనం

**కాకతీయ, చందుర్తి** : రైతుల భాగస్వామ్యంతో సమస్యలను గుర్తించి, పరిష్కార మార్గాలను అన్వేషించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని విద్యార్థులు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం మల్రిగడ్డ గ్రామంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పీజేటీయూ వ్యవసాయ కళాశాల తుది సంవత్సరం విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ అనుభవ కార్యక్రమంలో భాగంగా గ్రామ స్థాయి అధ్యయన కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులతో కలిసి గ్రామంలోని ప్రధాన వ్యవసాయ సమస్యలు, అందుబాటులో ఉన్న వనరులు, రైతుల అవసరాలను గుర్తిస్తూ అధ్యయనం చేపట్టారు. గ్రామ పటం, వనరుల పటం, సమస్యల ప్రాధాన్యత పట్టిక వంటి పద్ధతుల ద్వారా గ్రామ పరిస్థితులను అంచనా వేశారు. విద్యార్థులు లోకేష్, అభిరామ్, జ్ఞానేశ్వర్, హర్షిత్ రావు రైతులతో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించి, వ్యవసాయ సమస్యలను గుర్తించే విధానాలను వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఆర్. సాయి కుమార్, వ్యవసాయ అధికారి దుర్గరాజు, వ్యవసాయ విస్తరణ అధికారి శారద, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. విద్యార్థులు గ్రామస్థాయిలో చేపట్టిన ఈ చొరవను రైతులు, అధికారులు అభినందించారు.



# బకాయిలుంటే మిల్లులు సీజ్



**కాకతీయ, తెలంగాణ బ్యూరో** : ప్రభుత్వానికి బకాయిపడ్డ రైస్ మిల్లర్ల నుంచి ప్రతి పైసా రాబట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. ప్రభుత్వం నుంచి ధాన్యం తీసుకుని సకాలంలో బియ్యం అప్పగించకుండా బకాయిలు పెడుతున్న డిఫాల్ట్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉద్దేశపూర్వకంగా బకాయిలు చెల్లించకుండా తప్పించుకునే మిల్లులను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. బకాయిల వసూలు విషయంలో మిల్లర్ల బెదిరింపులు, బ్లాక్‌మెయిల్‌కు ప్రభుత్వం లొంగేది లేదని తేల్చిచెప్పారు. పౌరసరఫరాల శాఖపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం ఈ మేరకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ ధాన్యాన్ని తీసుకున్న తర్వాత నిబంధనల ప్రకారం బియ్యం అప్పగించకుండా బకాయిలు పెట్టే మిల్లర్లను ఉపేక్షించకూడదని సీఎం అన్నారు. ప్రభుత్వ ధనాన్ని తమ వద్దే ఉంచుకుని పదేపదే గడువులు దాటుతున్న వారిపై కఠినంగా వ్యవహరించాలని సూచించారు. బకాయిల రికవరీకి ప్రత్యేక విధానాన్ని రూపొందించి, గతంలో జరిగిన లోపాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బకాయిపడిన మిల్లుల వివరాలు, ప్రభుత్వం నుంచి తీసుకున్న ధాన్యం, తిరిగి అప్పగించాల్సిన బియ్యం, చెల్లించాల్సిన మొత్తాలను సమగ్రంగా పరిశీలించి రికవరీ ప్రక్రియను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు.

**బకాయిలుంటే.. మిల్లే స్వాధీనం**

బకాయిలు చెల్లించకుండా ఉద్దేశపూర్వకంగా తప్పించుకునే మిల్లులను స్వాధీనం చేసుకునే ప్రక్రియను ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. ప్రభుత్వానికి రావాల్సిన మొత్తాన్ని రాబట్టేందుకు చట్టపరమైన అన్ని మార్గాలను వినియోగించాలని సూచించారు. స్వాధీనం చేసుకున్న మిల్లులను నిరుపయోగంగా ఉంచకుండా వాటి నిర్వహణకు ప్రత్యామ్నాయ విధానాలను రూపొందించాలని అన్నారు. ప్రభుత్వ ధాన్యం, బియ్యం నిల్వల విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. స్వాధీనం చేసుకున్న మిల్లులను మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించే అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. మహిళా సంఘాలకు అవసరమైన శిక్షణ ఇచ్చి మిల్లింగ్ బాధ్యతలను కూడా అప్పగించే విధానంపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వానికి రావాల్సిన బకాయిలను రాబట్టడంతోపాటు మహిళా సంఘాలకు ఆర్థిక కార్యకలాపాల్లో భాగస్వామ్యం కల్పించేలా ఈ విధానం ఉండాలని సూచించారు.

**బెదిరింపులకు.. బ్లాక్‌మెయిల్‌కు నో!**

డిఫాల్ట్ మిల్లర్ల నుంచి వచ్చే ఒత్తిళ్లకు ప్రభుత్వం తలొగ్గబోదని సీఎం స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ప్రజాధనాన్ని తమ వద్దే ఉంచుకునే వారిపై కఠినంగా వ్యవహరించాలని అన్నారు. బకాయిల వసూలులో ఎవరి ఒత్తిడికీ లొంగకుండా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఉపయోగపడాల్సిన ప్రజాధనం కొందరి వద్ద బకాయిల రూపంలో నిలిచిపోవడానికి వీల్లేదని స్పష్టం చేశారు. గతంలో జరిగిన పొరపాట్లు పునరావృతం కాకుండా బకాయిల రికవరీకి ప్రత్యేక విధానం రూపొందించాలని సీఎం సూచించారు. ఈ అంశంపై క్యాబినెట్ సబ్ కమిటీలో సమగ్రంగా చర్చించి త్వరితగతిన తుది నిర్ణయం తీసుకోవాలని ఆదేశించారు. రైతుల ప్రయోజనాలను కాపాడటంతో పాటు ప్రభుత్వానికి రావాల్సిన మొత్తాన్ని పూర్తిగా రాబట్టడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని స్పష్టం చేశారు.

**ఐదు నియోజకవర్గాల్లో భారీ గోడౌన్లు**

రాష్ట్రంలో ధాన్యం నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు ఐదు శాసనసభ నియోజకవర్గాల్లో 50 నుంచి 100 ఎకరాల విస్తీర్ణంలో భారీ గోడౌన్ల నిర్మాణానికి పైలట్ ప్రాజెక్టును వెంటనే ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. ధాన్యం దిగుబడి అధికంగా ఉండే వ్యవసాయ ప్రాంతాలను ఇందుకోసం ప్రాధాన్య ప్రాతిపదికన ఎంపిక చేయాలని సూచించారు. నిర్మాణ వ్యయాన్ని సమర్థంగా భరించేందుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆదేశించారు. మార్కెట్లో అందుబాటులో ఉన్న గోడౌన్లను కూడా పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సీఎం సూచించారు. క్షేత్రస్థాయిలో ధాన్యం సేకరణ, మిల్లింగ్, నిల్వ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రతి జిల్లాకు ప్రత్యేక నోడల్ అధికారిని నియమించాలని పౌరసరఫరాల శాఖను ఆదేశించారు. రైతులకు చెల్లింపులు వేగంగా జరిగేలా, మిల్లుల వద్ద ఉన్న ధాన్యం, బియ్యం నిల్వల వివరాలు ఎప్పటికప్పుడు స్పష్టంగా అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ వ్యవస్థను పటిష్ఠం చేయాలని సూచించారు. ధాన్యం సేకరణ నుంచి మిల్లింగ్, నిల్వ, ప్రభుత్వానికి బియ్యం అప్పగింత వరకు ప్రతి దశలో జవాబుదారీతనం ఉండేలా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆస్తులు, ప్రజాధనాన్ని కాపాడటంలో ఎలాంటి రాజీ ఉండదని తేల్చిచెప్పిన నేపథ్యంలో.. బకాయిలు చెల్లించని మిల్లర్లపై ఇక కఠిన చర్యలు తప్పేలా కనిపించడం లేదు.





# బకాయిల వసూళ్లలో నిర్లక్ష్యం వద్దు

- రెవెన్యూ అధికారులకు కమిషనర్ వార్నింగ్
- అండర్ అసెస్మెంట్‌కు తావులేదు - కొత్త భవనాలపై ప్రత్యేక దృష్టి
- 13 వేల చేయూత పింఛన్ దరఖాస్తులు త్వరగా పూర్తి చేయాలి

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** జిడబ్ల్యూఎంసీ పరిధిలో పన్ను వసూళ్లకు అవకాశమున్న ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించి బకాయిలను సమర్థవంతంగా వసూలు చేయాలని జిడబ్ల్యూఎంసీ కమిషనర్ టి వెంకన్న రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో పన్నుల వసూళ్ల పురోగతి, కొత్త అసెస్మెంట్లు, పెండింగ్ బకాయిలపై కమిషనర్ సమీక్ష నిర్వహించారు. సర్కిళ్ల వారీగా వసూళ్ల పరిస్థితి, అధికారుల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, అసెస్మెంట్ వారీగా పన్నుల వసూళ్లపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకు సాగాలి. భారీగా పన్ను బకాయిలు ఉన్న ఆస్తుల వివరాలు ప్రతి అధికారికి క్షుణ్ణంగా తెలిసి ఉండాలి. వాటి వసూళ్లకు ప్రత్యేక ప్రణాళికతో పని చేయాలని స్పష్టం చేశారు.

**అండర్ అసెస్మెంట్‌కు అవకాశమే లేదు**

కొత్తగా నిర్మించిన భవనాలకు సంబంధించి అన్‌అసెస్మెంట్లు, అండర్‌అసెస్మెంట్లను వెంటనే గుర్తించి సక్రమంగా పన్నులు విధించాలని ఆదేశించారు. ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌లో ఉన్న వివరాల ఆధారంగానే అసెస్మెంట్ చేసి పన్నులు విధించాలి. ఎలాంటి అండర్ అసెస్మెంట్‌కు అవకాశం ఇవ్వొద్దు. బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులు క్షేత్రస్థాయిలో ఆస్తులను తనిఖీ చేస్తూ వసూళ్లను నిరంతరం పర్యవేక్షించాలని కమిషనర్ ఆదేశించారు. పన్నుల వసూళ్లలో పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, కార్యాలయాలకు వచ్చే నగరవాసులతో మర్యాదగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

**కాశీబుగ్గ, ఖాజీపేటలో 1828 కొత్త అసెస్మెంట్లు**

ఈ సమావేశంలో అదనపు కమిషనర్ జోనా మాట్లాడుతూ, కాశీబుగ్గ సర్కిల్‌లో 613, ఖాజీపేట సర్కిల్‌లో 1215 కొత్త అసెస్మెంట్లను గుర్తించామని తెలిపారు. మొత్తం 1828 అసెస్మెంట్లలో ఇప్పటికే 464 అసెస్మెంట్లకు సంబంధించిన పన్నులు వసూలు చేశామని వివరించారు.

**చేయూత పింఛన్ దరఖాస్తులు వెంటనే పూర్తి చేయాలి**

అనంతరం చేయూత పింఛన్ల దరఖాస్తుల పురోగతిని కమిషనర్ సమీక్షించారు. జిడబ్ల్యూఎంసీ పరిధిలో సుమారు 13 వేల దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. అందిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించి ఆన్‌లైన్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలి. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనం అందేలా సమన్వయంతో పనిచేయాలని డిప్యూటీ కమిషనర్లను కమిషనర్ ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, బిర్రు శ్రీనివాస్, పన్నుల అధికారి రామకృష్ణ, ఆర్‌ఓలు శ్రీనివాస్, బాకం సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## 58 ఏళ్లకే పెన్షన్ సౌకర్యం కల్పించాలి

**కాకతీయ, నెల్లికుదురు :** 58 ఏళ్ల వయసు కలిగిన వారందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలని సీపీఎం మండల ప్రధాన కార్యదర్శి ఇసంపల్లి సైదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎంపీడీవోకు వినతిపత్రం అందజేశారు. కొత్త పెన్షన్ విధానంలో షరతులు విధించే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని కోరారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్ అందించాలని, కొత్త అర్హులకు కూడా పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పెన్షన్లు పెంచి పేద కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. గ్రామాల్లో



తాగునీటి బావులు, ట్యాంకులను బ్లీచింగ్‌తో శుద్ధి చేసి పరిశుభ్రమైన నీరు అందించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జనార్దన్, పవన్, సిద్ధు, వంశీ, విక్రమ్, భాను ప్రసాద్, గణేష్, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

## క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ల రిజిస్ట్రేషన్ ఇక ఆన్‌లైన్

- సీఈఏ వెబ్‌సైట్, డిజిటల్ రిజిస్ట్రేషన్‌పై అధికారులకు శిక్షణ

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** రాష్ట్రంలోని అన్ని క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్లు ఇకపై తెలంగాణ సీఈఏ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సూచించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ (సీఈఏ) వెబ్‌సైట్, డిజిటల్ రిజిస్ట్రేషన్ విధానంపై బుధవారం వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అధికారులకు అవగాహన శిక్షణ నిర్వహించారు. జాయింట్ డైరెక్టర్ సీఈఏ డా. ప్రభు కిరణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సీఈఏ రాష్ట్ర బృంద సభ్యులు సునీల్‌రాజ్, కిరణ్‌కుమార్, అనిల్‌కుమార్, మొయినుద్దీన్ వెబ్‌సైట్




వినియోగం, ఆన్‌లైన్ దరఖాస్తు విధానంపై శిక్షణ ఇచ్చారు. వరంగల్ డీఎంహెచ్‌వో డా. బి. రాజారెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ పరిధిలోని ఐదు జిల్లాల డీఎంహెచ్‌వోలు, సీఈఏ సిబ్బంది శిక్షణలో పాల్గొన్నట్లు తెలిపారు. సీఈఏ చట్టం ప్రకారం అల్లోపతి, ఆయుష్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, డయాగ్నొస్టిక్, ఫిజియోథెరపీ కేంద్రాలు తదితర క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్లు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. హనుమకొండ, సిద్దిపేటలో పైలట్‌గా అమలు చేసిన డిజిటల్ విధానాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నామని, ఇకపై డిజిటల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు జారీ చేస్తామని తెలిపారు. ప్రైవేట్ సంస్థలు ఆన్‌లైన్ విధానాన్ని సద్వినియోగం చేసుకుని రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని కోరారు.

## ఆషాఢ అమావాస్యకు భక్తుల సందడి

**కాకతీయ, వరంగల్ :** ఆషాఢ మాస ముగింపు అమావాస్య సందర్భంగా మారుతీల్స్ కాలనీ న్యూ శాయంపేట సర్కిల్ పరిధిలోని శ్రీ వారాహి సహిత ఉన్మత్త భైరవ దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అమ్మవారికి విశేష అలంకరణ నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వీరభద్రనాథ్ మాట్లాడుతూ ఆషాఢ అమావాస్య ఎంతో విశిష్టమైనదని తెలిపారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని, అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులకు అన్నదాన ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు,



భక్తులు పాల్గొన్నారు.

# మహిళా మృతదేహం లభ్యం

**కాకతీయ, గీసుగొండ:** పూర్తిగా కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మహిళా మృతదేహం కీర్తినగర్ పరిసర ప్రాంతాల్లో లభ్యమైంది. గీసుగొండ సీఐ డి. విశ్వేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ మహానగర పాలక సంస్థ 16వ డివిజన్ పరిధిలోని కీర్తినగర్‌లో కట్టమల్లన్న దేవాలయం సమీపంలోని ఓపెన్ ప్లాట్‌లో ఉన్న చిన్న గదిలో మహిళ మృతదేహాన్ని గుర్తించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించగా 'బూర రామ, చిన్నగురజాల, నర్సంపేట' పేరుతో ఉన్న ఆధార్ కార్డు లభించింది. ఆధార్ కార్డులోని వివరాల ఆధారంగా మృతురాలి బంధువులను గుర్తించి వారికి సమాచారం అందించగా సంఘటన స్థలానికి చేరుకున్న బంధువులు,బూర రమ కొంతకాలంగా మానసిక అనారోగ్యంతో బాధపడుతూ నర్సంపేట, చెన్నారావుపేటతో పాటు బస్టాండ్లు,రైల్వే స్టేషన్ల పరిసరాల్లో తిరుగుతూ ఉండేదని తెలిపారు. గతంలో నాలుగైదు సార్లు ఆమెను ఇంటికి తీసుకు వచ్చినప్పటికీ,తిరిగి ఎవరికీ సమాచారం ఇవ్వకుండా ఇంటి నుంచి వెళ్లిపోయేదని పేర్కొన్నారు. మృతురాలి కుమారుడు సతీష్ తన తల్లి మృతిపై ఎలాంటి అనుమానం లేదని పేర్కొంటూ పోలీసులకు లిఖితపూర్వకంగా దరఖాస్తు ఇవ్వగా, బీఎన్‌ఎస్ సెక్షన్ 194 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు. తదుపరి వైద్య, చట్టపరమైన ప్రక్రియలు పూర్తిచేసి మృతదేహాన్ని బంధువులకు అప్పగించనున్నట్లు పేర్కొన్నారు.



## పేకాట స్థావరంపై పోలీసుల దాడి

- ఆరుగురు అరెస్టు.. రూ.18,250 నగదు స్వాధీనం

**కాకతీయ, ఏటూరునాగారం :** మంగపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని వాడగూడెం అటవీ ప్రాంతంలో పేకాట స్థావరంపై పోలీసులు కొరడా ఝుళిపించారు. పక్కా సమాచారం మేరకు బుధవారం మంగపేట పోలీసులు ఆకస్మికంగా దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.18,250 నగదును స్వాధీనం చేసుకున్నారు. పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని మంగపేట ఎస్ఐ టీవీఆర్ సూరి హెచ్చరించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పేకాట స్థావరాలపై నిఘా మరింత పెంచుతామని పోలీసులు తెలిపారు.

## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలి

**కాకతీయ, ఆత్మకూరు:** ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని రెడ్‌క్రాస్ చైర్మన్ డా. పెసరు విజయచందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఆత్మకూరు మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు ఉప్పుగాళ్ల శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులతో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల ఫలితమే నేటి స్వేచ్ఛ అని, విద్యార్థుల శక్తి, ప్రతిభ, క్రమశిక్షణ, దేశభక్తితో భారత్ మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. దేశభక్తి సోషల్ మీడియాకే పరిమితం కాకుండా ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగురవేయాలని కోరారు. ర్యాలీలో జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ మోరే రాజేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు ఇర్సడ్ల సదానందం, తదితరులు పాల్గొన్నారు.

## మేడారంలో సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు

**కాకతీయ, ఏటూరునాగారం :** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఈ నెల 16న మేడారం సమ్మక్క-సారలమ్మ వనదేవతలను దర్శించుకోనున్న నేపథ్యంలో పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాల నడుమ వనదేవతల దర్శనం, ప్రత్యేక పూజలు సజావుగా జరిగేలా ప్రతి అంశాన్ని ముందుగానే ప్రణాళిక చేసుకోవాలని సూచించారు. బుధవారం మేడారంలోని సమ్మక్క-సారలమ్మ ఆలయ ప్రాంగణం, హెలిప్యాడ్, కమాండ్ కంట్రోల్ రూమ్‌లను జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటీడీఏ పీవో లెనిన్ వస్సల్ టోప్పోలతో కలిసి పరిశీలించిన కలెక్టర్..ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఆలయ ప్రాంగణంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్.. పనుల పురోగతిపై గుత్తేదారులను అడిగి



వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సీహెచ్. మహేందర్ జి, ఆర్డీవో కృష్ణవేణి, డీఎస్పీ రవీందర్, ఆలయ ఈవో వీరస్వామి, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్యామ్ సింగ్, గుత్తేదారులు ఆదినారాయణ, తాడ్వాయి తహసీల్దార్ సురేష్‌బాబు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విజయవంతంగా ఉచిత మెగా వైద్య శిబిరం

- సర్జరీ కోసం 52 మందిని హైదరాబాద్‌కు తరలింపు

**కాకతీయ, ఏటూరునాగారం రూరల్:** ఏటూరునాగారం మండల కేంద్రంలోని సాయిబాబా దేవాలయం, సంజోష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర ఐ హాస్పిటల్ సహకారంతో బుధవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఆరు మండలాల నుంచి సుమారు 200 మంది హాజరై కంటి, బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకున్నారు. హాజరైన వారికి భోజన వసతి కల్పించారు. పరీక్షల అనంతరం సర్జరీ అవసరమైన 52 మందిని ప్రత్యేక బస్సులో హైదరాబాద్‌లోని శంకర ఐ హాస్పిటల్‌కు తరలించినట్లు సాయిబాబా దేవాలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్ తెలిపారు. సర్జరీ అనంతరం ప్రతి ఒక్కరికీ సంజోష్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి అద్దాలు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎగ్గడి జగదీష్, మెరుగు రఘుగౌడ్, రాజుపేట నర్సింగరావు, రాహుల్ ఫౌండేషన్ ప్రతినిధి రాహుల్, శంకర ఐ హాస్పిటల్ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి సేవిస్తున్న ముగ్గురి అరెస్టు

**కాకతీయ, గీసుగొండ:** గంజాయి సేవిస్తున్న ముగ్గురిని గీసుకొండ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారి నుంచి 10 గ్రాముల ఎండిన గంజాయితో పాటు సేవించేందుకు ఉపయోగించిన పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. సీఐ డి. విశ్వేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఐ జి. అనిల్‌కుమార్ సిబ్బందితో కీర్తినగర్‌లో పెట్రోలింగ్ చేస్తుండగా చెట్ల కింద అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో గంజాయి సేవించినట్లు అంగీకరించడంతో తనిఖీ చేయగా 10 గ్రాముల గంజాయి లభించింది. నిందితులను *కోయల సందీప్ (28), బోదాసు రంజిత్ (38), మనుగిరి (23)*గా గుర్తించారు. వీరిపై కేసు నమోదు చేసి తదుపరి చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

## కూలిన ఇంటిని పరిశీలించిన సర్పంచ్

**కాకతీయ, రుద్రంగి :** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో గత రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు లింగాల పోషవ్వ కు చెందిన ఇల్లు కూలిపోగా సర్పంచ్ గండి నారాయణ కూలిన ఇంటిని బుధవారం పరిశీలించారు. ఇట్టి విషయాన్ని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లి పోసవ్వ కు ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయేలా కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. సర్పంచ్ వెంట అక్కెనపెల్లి శ్రీనివాస్, దాసరి గంగరాజం, ఒద్యారపు ఆనంద్, దయ్యాల రమేష్ మల్యాల లింగయ్య ఉన్నారు.

## ప్రభుత్వ సాయంతో ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేసుకోవాలి

**కాకతీయ, మయూరి సెంటర్:** ప్రభుత్వ ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సూచించారు. బుధవారం ఖమ్మం నగరంలోని వెలుగుమట్లలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను ఆయన పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పునాది, గోడలు, స్లాబ్, తుదిదశ పనుల పురోగతిని పరిశీలించి నాణ్యతా ప్రమాణాలు పాటించేలా పర్యవేక్షించాలని సూచించారు. నిర్దిష్ట గడువులోగా నిర్మాణాలు పూర్తయ్యేలా సమన్వయంతో పనిచేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ జయచంద్ర, ఈఈ జగ్గారావు, ఏఈలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉరి వేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

**కాకతీయ, పెద్దవంగర :** అనారోగ్య సమస్యలతో సతమతమవుతూ జీవితంపై విరక్తితో ఉరి వేసుకొని వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని చిన్నవంగర గ్రామంలో చోటు చేసుకుంది. పెద్దవంగర మండల ఎస్సై ప్రమోద్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం చిన్నవంగర గ్రామానికి చెందిన రంగు వెంకన్న (72)గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో సతమతమవుతూ రెండు రోజుల క్రితం హైదరాబాద్ లో ఉంటున్న తన కుమారుడి దగ్గర భార్యతోపోయి మర్నాడు ఒక్కడే సొంత గ్రామానికి వచ్చి ఇంట్లోనే ఉరి వేసుకోని చనిపోయాడని తెలిపారు. ఈ సందర్భంగా మృతుడి కుమారుడు యాకసాయిలు పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## ప్రభుత్వ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

**కాకతీయ, ములుగు ప్రతినిధి:** ప్రభుత్వ విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. రజనీకాంత్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ములుగు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నూగూరు వెంకటాపురం నుంచి ములుగు కలెక్టరేట్ వరకు పాదయాత్ర నిర్వహించి, అనంతరం ముట్టడి చేపట్టారు. ఈ సందర్భంగా రజనీకాంత్ మాట్లాడుతూ ములుగు జిల్లా కేంద్రంలో ఎస్సీ విద్యార్థుల కోసం కళాశాల హాస్టల్ మంజూరు చేయాలని, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, తరగతి గదులు, ఫర్నిచర్, ప్రహరీ వంటి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జాగటి రవితేజ, కార్యదర్శి టి.ఎల్. రవి తదితరులు పాల్గొన్నారు.




## తొర్రూర్ డివిజన్ విద్యుత్ డిఈగా కృష్ణ బాధ్యతలు.

**కాకతీయ, పెద్దవంగర /తొర్రూర్ :** విద్యుత్ శాఖ మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ డివిజన్ డిఈ గా కృష్ణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు ఆయన విధుల్లో చేరారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ సరఫరాకు పటిష్ట చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అంతరాయం లేని విద్యుత్ సరఫరాతో పాటు లో వోల్టేజీ నివారణ లక్ష్యంగా కృషి చేస్తామని తెలిపారు.అనంతరం పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పాలకుర్తి శాసనసభ సభ్యురాలు యశస్విని రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ తొర్రూరు డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరా, ప్రజలకు ఎదురవుతున్న విద్యుత్ సమస్యల పరిష్కారం, విద్యుత్ శాఖకు సంబంధించిన అభివృద్ధి పనులను సమర్థవంతంగా చేపట్టాలని ఆమె సూచించారు.ప్రజలకు మెరుగైన విద్యుత్ సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె ఆకాంక్షించారు.



## ఆరుతడి పంటల సాగుపై అవగాహన కల్పించాలి

**కాకతీయ, పెద్దవంగర :** వర్షాకాలం వర్షాభావ పరిస్థితుల నేపథ్యం లో రైతులు ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేసేలా రైతులకు అవ గాహన కల్పించాలని ఏఓ స్వామి నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని అవుతాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ తోటకూరి శ్రీనివాస్ అధ్యక్షతన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురిసే అవకాశం ఉందని, రైతులకు వరి సాగుకు బదులుగా ప్రత్యామ్నాయంగా తక్కువ నీటితో సాగు చేసే కంది, పెసర, మినుముతో పాటు కూరగాయలు సాగు చేసుకునేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. అందుబాటులో ఉన్న నీటి వనరులను ఉపయోగించుకుంటూ పంటలను సాగు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ విశ్వశాంతి,కార్యదర్శి పావని,ఉప సర్పంచ్ రైతులు తదితరులు పాల్గొన్నారు.



## రోడ్డు భద్రతపై అవగాహన అవసరం

**కాకతీయ, నెల్లికుదురు:** రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె. వీరస్వామి గౌడ్ అన్నారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్-1, 2 ఆధ్వర్యంలో బుధవారం రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని, అతివేగం, మద్యం సేవించి డ్రైవింగ్, సెల్‌ఫోన్ వినియోగం, నిర్లక్ష్యపు ఓవర్‌టేకింగ్‌కు దూరంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రా క్రాసింగ్‌ను పాటించాలని కోరారు. అనంతరం విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లతో రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మర్సకట్ల అనిల్‌కుమార్, అధ్యాపకులు సుధాకర్, నాగేశ్వరరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం

**కాకతీయ, నెక్కొండ :** ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూఎస్పీసీ డిమాండ్ చేసింది. సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించింది. రాష్ట్ర స్టీరింగ్ కమిటీ పిలుపు మేరకు బుధవారం నెక్కొండ తహసీల్దార్ ద్వారా ముఖ్యమంత్రికి వినతిపత్రం అందజేశారు. పీఆర్సీ గడువు ముగిసి మూడేళ్లు దాటినా అమలు చేయలేదని, ఆరు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని నాయకులు తెలిపారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల బిల్లులు విడుదల చేయాలని, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరారు. హెల్త్‌కార్డులు, 25 జీవో, పర్యవేక్షక పోస్టులు, కేజీబీవీ, మోడల్ స్కూల్, గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 19న జిల్లా కేంద్రాల్లో ధర్నా, 29న హైదరాబాద్‌లో మహాధర్నా, సెప్టెంబరులో చలో అసెంబ్లీ నిర్వహిస్తామని తెలిపారు.



## హెచ్ఐవిపై భయం కాదు.. అవగాహనే పరిష్కారం

**వరంగల్ కలెక్టర్ సత్యశారద**

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** హెచ్ఐవి/ఎయిడ్స్ నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు రెండు నెలల ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్‌ను కలెక్టర్ డా. సత్యశారద బుధవారం ఎంజీఎం ఆస్పత్రిలో ప్రారంభించారు. ఆగస్టు 12 నుంచి అక్టోబర్ 12 వరకు 200 గ్రామాలు, 200 పాఠశాలలు, 50 కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 4 వేల ఇళ్లలో ఇంటింటి ప్రచారం, ప్రభుత్వ ఆస్పత్రుల్లో శిబిరాలు, 100 బైక్‌లతో ర్యాలీ చేపడతామన్నారు. హెచ్ఐవి వ్యాప్తి, నివారణ, పరీక్షలు, చికిత్సపై అవగాహన కల్పించి అపోహలు తొలగించాలన్నారు. అనంతరం హెచ్ఐవీ ప్రభావిత పిల్లలకు పోషణ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా. బి. రాజారెడ్డి, ఎంజీఎం సూపరింటెండెంట్ డా. రామ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించాలి

- నీటి కొరత ఏర్పడే అవకాశం.. అప్రమత్తంగా ఉండాలి
- తాలిపేరు ప్రాజెక్టును సందర్శించిన కలెక్టర్ అంకిత్

**కాకతీయ, కొత్తగూడెం ప్రతినిధి:** వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్‌లో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున అందుబాటులో ఉన్న నీటిని ప్రణాళికాబద్ధంగా వినియోగించాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. తాగునీటికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, తాలిపేరు ప్రాజెక్టులో నీటిమట్టం, ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లోను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. బుధవారం చర్లలోని తాలిపేరు ప్రాజెక్టు, ఏకలవ్య మోడల్ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తాలిపేరు ప్రాజెక్టును పరిశీలించిన కలెక్టర్ ప్రస్తుత నీటిమట్టం, నీటి ప్రవాహం, విడుదల, ప్రాజెక్టు నిర్వహణపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం 73.80 మీటర్ల నీటిమట్టం ఉందని, పూర్తి స్థాయి నీటి మట్టం 74 మీటర్లని అధికారులు తెలిపారు. ఛత్తీస్‌గఢ్ నుంచి ప్రాజెక్టుకు ప్రధానంగా నీటి ప్రవాహం వస్తోందని, గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఇన్‌ఫ్లో తక్కువగా ఉందని వివరించారు. బుధవారం సుమారు 2,200 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైందని, రానున్న రోజుల్లో మరింత తగ్గే అవకాశం ఉందని తెలిపారు.

**విద్యార్థుల విద్య, ఆరోగ్యంపై దృష్టి**

అనంతరం ఏకలవ్య మోడల్ పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యాబోధన, విద్యార్థుల హాజరు, వసతులు, భోజనం, వైద్య సేవలు, పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠ్యాంశాలపై ప్రశ్నలు అడిగి వారి అభ్యసన సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. నోట్‌బుక్స్, పాఠ్యపుస్తకాలను పరిశీలించారు. పాఠశాలలోని హెల్త్ సెంటర్‌ను సందర్శించి మందుల నిల్వ, వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షల వివరాలను ఏఎన్ఎంను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు విద్య, ఆరోగ్యం, పోషకాహారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పర్యటనలో తహసీల్దార్, ఇరిగేషన్, విద్యా శాఖ, ఎంపీడీవో, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బీసీ మహిళలకు ఆర్థిక స్వావలంబనే లక్ష్యం

- 1.19 లక్షల ఆటోమేటిక్ కుట్టు మిషన్ల పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం
- ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున అందజేత
- నేడు సచివాలయంలో పథకాన్ని ప్రారంభించనున్న మంత్రి పొన్నం ప్రభాకర్



**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** బీసీ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం కీలక పథకానికి శ్రీకారం చుట్టింది. కుట్టు వృత్తిపై ఆసక్తి, నైపుణ్యం ఉన్న పేద, నిరుద్యోగ బీసీ మహిళలకు 100 శాతం ప్రభుత్వ సబ్సిడీతో ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకాన్ని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం లాంఛనంగా ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని 119 శాసనసభ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గానికి 1,000 చొప్పున మొత్తం 1,19,000 ఆటోమేటిక్ కుట్టు మిషన్లను బీసీ మహిళలకు పంపిణీ చేయనున్నారు. లబ్ధిదారులపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండా పూర్తిగా ప్రభుత్వ సబ్సిడీతో మిషన్లను అందించనుండటం ఈ పథకం ప్రత్యేకత. ఆగస్టు 13న గురువారం మధ్యాహ్నం 12 గంటలకు హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలోని జీ29లో పథకం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఈ కార్యక్రమంలో పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. కార్యక్రమానికి బీసీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, బీసీ కార్పొరేషన్ చైర్మన్లు హాజరుకానున్నారు.

**ఇంటి వద్దే స్వయం ఉపాధి**

కుట్టు వృత్తిలో నైపుణ్యం ఉన్న మహిళలకు ఆధునిక ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అందించడం ద్వారా ఇంటి వద్దే స్వయం ఉపాధి పొందే అవకాశం కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. తద్వారా మహిళల ఆదాయం పెరగడంతో పాటు కుటుంబాల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడతాయని పేర్కొంది. మహిళలను కేవలం ప్రభుత్వ పథకాల లబ్ధిదారులుగా కాకుండా ఆదాయం ఆర్జించే స్వయం ఉపాధి మహిళలుగా, భవిష్యత్ మహిళా పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం ఈ పథకం ప్రధాన ఉద్దేశంగా ప్రభుత్వం చెబుతోంది. పథకానికి సంబంధించిన విధివిధానాలు, బడ్జెట్ కేటాయింపులు, లబ్ధిదారుల ఎంపిక, అర్హతలు, దరఖాస్తు ప్రక్రియ తదితర పూర్తి వివరాలను మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమంలో వెల్లడించనున్నారు. బీసీ మహిళలకు స్వయం ఉపాధి కల్పించి ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా ఈ పథకం కీలక ముందడుగుగా నిలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

## మాలల హక్కుల కోసం చలో సెక్రటేరియట్

**కాకతీయ, చేర్యాల :** ఎస్సీ వర్గీకరణ అనంతరం గ్రూప్-3లోని మాలలు, వారి అనుబంధ 25 కులాలకు విద్య, ఉద్యోగాలు, పదోన్నతుల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని జాతీయ మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ ఆరోపించారు. చేర్యాలలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ రోస్టర్ విధానం వల్ల మాల విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని అన్నారు. ఇప్పటివరకు ప్రకటించిన 14 ఉద్యోగ నోటిఫికేషన్లలో గ్రూప్-3లోని మాల, అనుబంధ కులాల అభ్యర్థులకు ఒక్క పోస్టు కూడా దక్కలేదని పేర్కొన్నారు. మాలల హక్కులు, భవిష్యత్తు కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా ఆగస్టు 31న సెక్రటేరియట్ ముట్టడి నిర్వహించనున్నట్లు తెలిపారు. మాలలు అధిక సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## జీపీ కార్మికుల దీక్షలను జయప్రదం చేయండి

**కాకతీయ, చేర్యాల:** గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18, 19 తేదీల్లో మండల ఎంపీడీవో కార్యాలయాల ఎదుట చేపట్టనున్న దీక్షలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అమ్ముల బాల్ నర్సయ్య పిలుపునిచ్చారు. చేర్యాల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులకు ప్రతి నెల 1వ తేదీన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు, ప్రభుత్వం నేరుగా బ్యాంకు ఖాతాల్లో జీతాలు జమ చేయడం, మల్టీపర్పస్ విధానం రద్దు, ప్రమాద బీమా రూ.20 లక్షలు తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి చిట్యాల కనకయ్య, మండల నాయకులు దర్శనం శంకరయ్య, పంజా రాజు, జక్కుల ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

- సైబర్, గల్ఫ్ మోసాలపై ప్రజలను అప్రమత్తం చేయాలి
- పాత నేరస్తులపై నిరంతర నిఘా : ఎస్పీ మహేష్ బి.గితే



**కాకతీయ, రుద్రంగి :** నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టడంతో పాటు ఆధునిక సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే పోలీసు సిబ్బందిని ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా బుధవారం రుద్రంగి పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. స్టేషన్‌లో నమోదైన కేసులు, పెండింగ్ కేసుల దర్యాప్తు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది హాజరు, పెట్రోలింగ్, రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిఘాను సమీక్షించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి బాధితులకు సత్వర న్యాయం అందించాలని సూచించారు. సాక్ష్యాల సేకరణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, సీసీటీఎన్ఎస్ సాంకేతికతను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సైబర్ నేరాలు, నకిలీ ఉద్యోగ ప్రకటనలు, వీసా మోసాలు, గల్ఫ్ ఉద్యోగాల పేరుతో జరిగే మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. బ్లూకోల్ట్, పెట్రోకార్ సిబ్బంది గ్రామాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని, అనుమానితులు, హిస్టరీషీటర్లు, పాత నేరస్తుల కదలికలపై నిఘా ఉంచాలని సూచించారు. మాదకద్రవ్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. 'నేను సైతం' కార్యక్రమంలో ప్రజల భాగస్వామ్యంతో మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ తనిఖీలో డీఎస్పీ శ్రీనివాసులు, సీఐ రవీందర్, ఎస్ఐ మోతీలాల్ తదితరులు పాల్గొన్నారు.

# చుంచనకోటలో ఇక 24 గంటల నిఘా

- సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణకు చర్యలు
- ప్రధాన కూడళ్లు, సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతర పర్యవేక్షణ
- ప్రజలు, వ్యాపారులు కూడా కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి
- సిద్దిపేట కమిషనరేట్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్



**కాకతీయ, చేర్యాల:** చుంచనకోట గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాల నిఘా వ్యవస్థ అందుబాటులోకి వచ్చింది. గ్రామంలోని ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలను బుధవారం అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ గొర్రె శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కెమెరాలను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలతో 24 గంటల పాటు నిరంతర నిఘా కొనసాగుతుందని తెలిపారు. దొంగతనాలు, ఇతర అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు నిందితులను త్వరితగతిన గుర్తించి పట్టుకోవడంతోపాటు ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను గుర్తించేందుకు కెమెరాల ఫుటేజీ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రజలు, వ్యాపారులు తమ ఇళ్లు, దుకాణాల వద్ద కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుని శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని కోరారు.

**గ్రామ భద్రతకు ప్రాధాన్యం**

సర్పంచ్ గొర్రె శ్రీనివాస్ మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానంగా పనిచేస్తుందని అన్నారు. గ్రామంలో కెమెరాల ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందించిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దాతలను ఘనంగా సన్మానించారు. గ్రామ రక్షణకు సీసీ కెమెరాల ఏర్పాటు చేపట్టిన సర్పంచ్‌ను గ్రామ పెద్దలు అభినందించారు. కార్యక్రమంలో చేర్యాల సీఐ రమేష్ నాయక్, ఎస్ఐ అపూర్వ రెడ్డి, ఉపసర్పంచ్ వట్టిపల్లి ఆగయ్య, వార్డు సభ్యులు మంద వెంకట్ రెడ్డి, వడ్లకొండ వెంకటేశం, శ్రీపతి కమలేష్, శీర్ల శ్రీకాంత్, గ్రామ వీఓపీ రంగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాంబాబు, కారోబార్ రమేష్, గ్రామపంచాయతీ సిబ్బంది, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## క్వారీ లారీ డ్రైవర్ల యూనియన్ పాలకవర్గానికి సన్మానం



**కాకతీయ, ఖమ్మం టౌన్:** ఖమ్మం గ్రానైట్ మార్కర్ యూనియన్ ఆధ్వర్యంలో కొత్తగా ఎన్నికైన క్వారీ లారీ డ్రైవర్ల యూనియన్ పాలకవర్గ సభ్యులను మంగళవారం సన్మానించారు. యూనియన్ కార్యాలయంలో అధ్యక్షుడు కిషన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్వారీ లారీ డ్రైవర్ల యూనియన్ అధ్యక్షుడు బండారి మధు, ఉపాధ్యక్షుడు కుంట శీను, కార్యదర్శి చింతల ఉపేందర్ తదితరులను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. యూనియన్ గౌరవ సలహాదారు నరేంద్ర మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి అండగా ఉంటామన్నారు. అధ్యక్షుడు కిషన్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమమే తమ ధ్యేయమని తెలిపారు. కార్యక్రమంలో పాషా, సైదులు, జానీ, నరసింహారావు, వెంకటేశు, రమేష్, రఘు, గంగరాజు, నరహరి తదితరులు పాల్గొన్నారు.

# రూ.4.15 కోట్ల అభివృద్ధి పనుల పరిశీలన

- నాణ్యతతో పనులు.. నిర్ణీత సమయంలో పూర్తి చేయాలి
- రోడ్లపై అక్రమ ర్యాంపులు, దుకాణాలు తొలగించాలని ఆదేశం
- ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గ ప్రసాద్



**కాకతీయ, ఖమ్మం టౌన్ :** ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఖమ్మం సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని 18వ డివిజన్, రోడ్ నంబర్ 10, శ్రీరామ్‌నగర్‌లో వివిధ నిధుల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎల్ఆర్ఎస్, మున్సిపల్ జనరల్, సుడా, అర్బన్ డెవలప్‌మెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ నిధులతో మొత్తం రూ.4.15 కోట్ల 60 వేల వ్యయంతో చేపడుతున్న సీసీ కాలువలు, కల్వర్టులు, సీసీ రోడ్ల నిర్మాణ పనుల పురోగతిని మున్సిపల్, సుడా అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో పనులు చేపట్టి నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. డివిజన్‌లో రోడ్లపై అక్రమంగా నిర్మించిన ర్యాంపులు, దుకాణాలను వెంటనే తొలగించాలని టౌన్ ప్లానింగ్ టీపీఎస్, టీపీవోలకు ఆదేశించారు. నూతనంగా నిర్మిస్తున్న కాలువలకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని విద్యుత్ అధికారులను కోరారు. కాల్వకట్టపై నివసిస్తున్న పేద కుటుంబాల సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని దుర్గ ప్రసాద్ హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు నాగండ్ల దీపక్ చౌదరి, మాజీ మేయర్ పునుకొల్లు నీరజ, మాజీ కార్పొరేటర్ మందడపు లక్ష్మీ మనోహర్, దొబ్బల సౌజన్య, కమర్తపు మురళి, గౌస్, హుస్సేన్, అధికారులు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## చేర్యాలలో హర్ ఘర్ తిరంగా అభియాన్ ర్యాలీ

**ఇంటింటా జాతీయ జెండా ఎగురవేయాలి : బీజేపీ రాష్ట్రనేత బల్ల శ్రీనివాస్**



**కాకతీయ, చేర్యాల :** ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి దేశ ఐక్యతను ప్రపంచానికి చాటాలని బీజేపీ రాష్ట్రనేత బల్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. హర్ ఘర్ తిరంగా అభియాన్‌లో భాగంగా బీజేపీ మండల అధ్యక్షుడు వడ్లకొండ సంజీవులు గౌడ్ ఆధ్వర్యంలో చేర్యాలలో బుధవారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ త్రివర్ణ పతాకాన్ని గర్వంగా చేతబట్టి ముందుకు సాగుతున్న ప్రతి క్షణం స్వాతంత్ర్య సమరయోధులు, వీర జవాన్ల త్యాగాలను స్మరించుకోవాలన్నారు. వారి ధైర్యం, అంకితభావం, దేశసేవ ఫలితంగానే భారత్ ప్రపంచ దేశాల ముందు గర్వించే స్థాయికి ఎదిగిందన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో భారత్ నూతన ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతూ వికసిత్ భారత్ లక్ష్యంగా పురోగమిస్తోందని పేర్కొన్నారు. త్రివర్ణ పతాకాన్ని గౌరవంగా చేతబట్టడమే కాకుండా, దాని స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ నిత్యం హృదయాల్లో నిలుపుకోవాలని సూచించారు. ర్యాలీలో వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులతో పాటు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ నర్రా మహేందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కాశెట్టి పాండు, మండల ప్రధాన కార్యదర్శులు తౌట బాలరాజు, మన్నె సత్యవర్ధన్, ముచ్చంతల సిద్ధారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు బయ్యారపు యాదగిరి, పట్టణ ప్రధాన కార్యదర్శి మనీశ్, కొట్టె చంద్రమౌళి, బీజేవైఎం నాయకులు మనోజ్‌కుమార్, ప్రవీణ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ అక్రిడేషన్లు వెంటనే మంజూరు చేయాలి



**కాకతీయ, ఖమ్మం టౌన్ :** అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు పెండింగ్‌లో ఉన్న అక్రిడేషన్ కార్డులను జాప్యం లేకుండా మంజూరు చేయాలని టీజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆకుతోట ఆదినారాయణ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌కు టీజేఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. పెద్ద, మీడియం, చిన్న పత్రికలు, చానళ్లు, ఇండిపెండెంట్ జర్నలిస్టుల రిపోర్టర్లందరికీ కార్డులు ఇవ్వాలని, నియోజకవర్గ ఇన్‌చార్జిలకు జిల్లా కార్డులు, రాష్ట్రస్థాయి బస్సు పాస్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఎంప్యానల్ కేబుల్ చానళ్లకు అక్రిడేషన్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ స్పందిస్తూ అక్రిడేషన్ కమిటీ సమావేశం నిర్వహించి అర్హులైన ప్రతి జర్నలిస్టుకు కార్డులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని డీపీఆర్వో గౌస్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో చిర్రా రవి, వెన్నబోయిన సాంబశివరావు, బొల్లం శ్రీనివాస్, శెట్టి రజినీకాంత్, ప్రశాంత్ రెడ్డి, భాస్కర్, మందుల ఉపేందర్, హరీష్, మందటి రమణ, గుద్దేటి రమేష్ బాబు, రామి శెట్టి విజేత, అడపాల నాగేందర్, శాస్త్రి, రాజు, నాగరాజు, అమరవరపు కోటేశ్వరరావు, ఎస్వీ రెడ్డి, రేపాక యాదగిరి, ఉల్లోజు రమేష్, నల్లమోతు శ్రీనివాస్, గోవిందు, రోసి రెడ్డి, ఇసంపల్లి వెంకటేశ్వర్లు, మాధవి, కిరణ్మయి, పెంటి వెంకటేశ్వర్లు, మోహన్, సాయి, గౌరీ శంకర్, పాశం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## భువనగిరి రోడ్ల అభివృద్ధికి గడ్కరీకి ఎంపీ వినతి

**కాకతీయ, భువనగిరి :** భువనగిరి పార్లమెంట్ పరిధిలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. బుధవారం గడ్కరీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఎన్‌హెచ్ 163ను ఆరు లైన్లుగా విస్తరించడంతో పాటు అనంతారం, రామకృష్ణాపురం వద్ద అండర్‌పాస్‌లు, సర్వీస్ రోడ్లు నిర్మించాలని కోరారు. భువనగిరి కేంద్రీయ విద్యాలయం, స్వర్ణగిరి ఆలయం, బీబీనగర్ ఎయిమ్స్, సింగన్నగూడెం వద్ద అవసరమైన ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్‌హెచ్ 565పై రోడ్డు విస్తరణ, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు, డ్రైనేజీ, సర్వీస్ రోడ్లు, ఎన్‌హెచ్ 365పై హనుమాన్ ఆలయం వద్ద ఫుట్ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. పనులు పూర్తయితే ప్రమాదాలు తగ్గి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ఎంపీ తెలిపారు.

# వేటగాళ్ల విద్యుత్ ఉచ్చుకు ఎఫ్‌బీఓ బలి

- విధి నిర్వహణలో విషాదం.. బానోతు నవీన్ మృతి
- వన్యప్రాణుల వేటకు ఉచ్చు ఏర్పాటు చేసినట్లు అనుమానాలు
- నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికుల డిమాండ్



**కాకతీయ, కారేపల్లి :** వన్యప్రాణుల వేట కోసం ఏర్పాటు చేసినట్లు భావిస్తున్న విద్యుత్ ఉచ్చుకు అటవీశాఖ ఉద్యోగి బలైన విషాద ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలో చోటుచేసుకుంది. నకిరిపేట సమీపంలోని అటవీ ప్రాంతంలో ఈ ఘటన జరిగినట్లు సమాచారం. విధి నిర్వహణలో భాగంగా అటవీ ప్రాంతానికి వెళ్లిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ (ఎఫ్‌బీఓ) భానోత్ నవీన్ విద్యుత్ ఉచ్చుకు గురై మృతి చెందినట్లు తెలుస్తోంది. సింగరేణి మండలం వెంకట్యాతండాకు చెందిన మాజీ ఎంపీపీ భానోత్ దేవ్లా నాయక్ కుమారుడైన నవీన్ చెరువు సింగారం వెస్ట్ బీట్‌లో ఎఫ్‌బీఓగా విధులు నిర్వహిస్తున్నారు. విధుల్లో భాగంగా అటవీ ప్రాంతానికి వెళ్లిన ఆయన.. గుర్తుతెలియని వ్యక్తులు వన్యప్రాణుల వేట కోసం ఏర్పాటు చేసినట్లు భావిస్తున్న విద్యుత్ ఉచ్చుకు చిక్కినట్లు సమాచారం. విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలుస్తోంది. వన్యప్రాణుల వేటను అరికట్టేందుకు విధులు నిర్వహిస్తున్న అటవీ శాఖ ఉద్యోగే విద్యుత్ ఉచ్చుకు బలికావడం ఆందోళన కలిగిస్తోంది. అటవీ ప్రాంతాల్లో అక్రమంగా విద్యుత్ ఉచ్చులు ఏర్పాటు చేస్తున్న వేటగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది. విద్యుత్ ఉచ్చును ఎవరు ఏర్పాటు చేశారు? దీని వెనుక ఎవరున్నారు? అనే కోణాల్లో అధికారులు దర్యాప్తు చేపట్టాల్సి ఉంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉండగా, నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

## ఖమ్మం జిల్లా పోలీసుల కృషి అభినందనీయం



**కాకతీయ, ఖమ్మం టౌన్ :** తిరుమలాయపాలెం మండలం పిండిప్రోలులో ఇటీవల జరిగిన చెన్న సుగుణమ్మ హత్య, దోపిడీ కేసును తక్కువ సమయంలో ఛేదించిన ఖమ్మం జిల్లా పోలీసుల కృషి అభినందనీయమని ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో దర్యాప్తు చేపట్టి నిందితులను గుర్తించి అరెస్టు చేయడంలో కీలకంగా వ్యవహరించిన జిల్లా పోలీస్ కమిషనర్, రూరల్ ఏసీపీతో పాటు పోలీసు అధికారులు, సిబ్బందిని ఆయన అభినందించారు. నిందితులకు చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జిల్లాలో నిఘా మరింత పటిష్టం చేయాలని పోలీసులను కోరారు. ప్రజలు శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని తాతా మధుసూదన్ విజ్ఞప్తి చేశారు.

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266